సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 20 । ఏప్రిల్ । 2024



మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్. వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం తదితరులు

వైఎస్సార్ సీపీ ఎన్నికల గుర్తు సీలింగ్ ఫ్యాన్‌ను చూపుతున్న సీఎం జగన్



కాకినాడ రూరల్ అచ్చంపేట జంక్షన్ వద్ద 'మేమంతా సిద్ధం సభకు అశేషంగా తరలివచ్చిన జనంలో ఓ భాగం



సభకు తరలి వచ్చిన ప్రజలకు సీఎం జగన్ అభివాదం



జగన్ మామతోనే నీకు బంగారు భవిష్యత్తురా కన్నా!

ఫ్యాన్.. ఫుల్ స్పీడ్

- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో సమరోత్సాహం
- జననేతపై చెక్కు చెదరని అభిమానం
- రెట్టింపైన నమ్మకంతో పెరిగిన వలసలు
- టీడీపీ, జనసేనల నుంచి చేరికలతో నూతనోత్తేజం
- 12 నియోజకవర్గాల ప్రజలతో మమేకం
- ఏడీబీ రోడ్డులో దారి పొడవునా జనమే జనం

నదులన్నీ సముద్రం వైపు వరుగు తీసినట్టు.. జనమంతా జగన్ వెనుకే ఉరకలెత్తారు. తమ భవితను తీర్చిదిద్దే ప్రగతి విధాత ఆయనేనని మనసా వాచా కర్మణా నమ్ముతూ.. దిక్కులు పిక్కటిల్లేలా 'జై జగన్' అంటూ నినదించారు. వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మళ్లీ జగనే సీఎం కావాలంటూ ముక్తకంఠంతో నినాదాలు చేశారు. సీఎం జగన్ బస్సు యాత్ర వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. సార్వత్రిక సమరానికి సర్వసన్నద్ధుల్ని చేసింది.

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండు రోజుల పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఫుల్ జోష్ నింపింది. సార్వత్రిక ఎన్నికలకు పట్టుమని పాతిక రోజులు కూడా సమయం లేదు. ఒక వైపు నోటిఫికేషన్ వెలువడి మంచి రోజులు, ముహూర్తాలు చూసుకుని పార్టీ అభ్యర్థులు అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ఈ తరుణంలో పార్టీ అధ్యక్షుడిగా సీఎం జగన్ అటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఇటు తూర్పు గోదావరి, మరోవైపు కాకినాడ జిల్లాల్లో మండుటెండను సైతం లెక్క చేయకుండా.. పగలనక, రాత్రనక నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు దారి పొడవునా ప్రజాభిమానం ఉప్పొంగింది. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ నిర్వహిస్తున్న 'మేమంతా సిద్ధం' సభల్లో భాగంగా.. ఉమ్మడి తూర్పు గోదావరిలో తొలి రోజైన గురువారం తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లో ఆయన బస్సు యాత్ర సాగింది. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం సమీపాన రాత్రి బస చేసిన ఎస్‌టీ రాజాపురం నుంచి రెండో రోజైన శుక్రవారం ఉదయం 10.46 గంటలకు బస్సు యాత్ర ప్రారంభమై కాకినాడ జిల్లా తునిలో రాత్రికి ముగిసి అనకాపల్లి జిల్లాకు వెళ్లింది. ఈ రెండు రోజుల యాత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 12 నియోజకవర్గాల్లో దారి పొడవునా ప్రజలతో మమేకమయ్యారు. రాజకీయ విశ్లేషకుల అంచనాలను సైతం తలకిందులు చేస్తూ సీఎం జగన్‌పై గుండెల్లో దాచుకున్న ఈ ప్రాంత ప్రజల అభిమానం ఈ బస్సు యాత్రలో ఒక్కసారిగా పెల్లుబుకింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజల్లో జగన్‌పై అభిమానం రెట్టింపైందే తప్ప ఎక్కడా చెక్కుచెదరలేదనే విషయం ఈ యాత్రలో అడుగడుగునా స్పష్టమైంది.

ప్రతిపక్ష నేతల చేరిక

- మొత్తంగా పార్టీ శ్రేణుల్లో ఈ యాత్ర మరింత జోష్ నింపింది. సీఎం జగన్‌కు లభిస్తున్న ఆదరాభిమానాలపై బలమైన నమ్మకం ఉండబట్టే ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న ప్రతిపక్ష నేతల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ పరిణామం పార్టీ శ్రేణుల్లో ఎక్కడ లేని ఉత్తేజాన్ని నింపింది.
- మొదటి రోజు తణుకు సమీపంలోని తేతలిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల టీడీపీ, జనసేన పార్టీల నేతలు బొంతు రాజేశ్వరరావు, నీతిపూడి గణేష్‌బాబు వైఎస్సార్ సీపీలో చేరారు.
- రెండో రోజు కాకినాడ జిల్లా నుంచి మాజీ మేయర్ పాలసపల్లి సరోజ చెరియన్, పెద్దాపురం టీడీపీ నుంచి తోట సుబ్బారావు నాయుడు, ముత్యాల శ్రీనివాస్, జనసేన నుంచి గోపాల్, సినీ నటుడు గౌతమ్‌రాజు తదితరులు ఎస్‌టీ రాజాపురంలో వైఎస్సార్ సీపీకి జై కొట్టారు.

పార్టీ నేతలకు ఆత్మీయ పలకరింపు

బస్సు యాత్రకు బయలుదేరడానికి ముందు సీఎం జగన్ ఎస్‌టీ రాజాపురం వద్ద టెంటులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నాయకులను పేరుపేరునా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దీంతో ఆ నాయకుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుబ్బల తులసీకుమార్ తదితర నేతలతో జగన్ ముచ్చటించారు.

దారి పొడవునా జన సందోహం

- పార్టీ నేతలతో మాట్లాడిన అనంతరం ఎస్‌టీ రాజాపురం రాత్రి బస శిబిరం నుంచి ఉదయం 10.46 గంటలకు బస్సు యాత్ర ప్రారంభమైంది.
- ఎస్‌టీ రాజాపురం, వడిశలేరు, రంగంపేట, కోటపాడు, పెద్దాపురం బైపాస్, సామర్లకోట, అచ్చంపేట ఫ్లై ఓవర్, ఉండూరు క్రాస్ వరకూ ఏడీబీ రోడ్డులో దారి పొడవునా సీఎం జగన్‌కు అశేష జనసందోహం అఖండ స్వాగతం పలికింది.
- సూరంపాలెంలో ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు వినూత్న రీతిలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. 'అన్నా నువ్వు జాగ్రత్తగా వెళ్లి తిరిగి సీఎంగా తిరిగి రా' 'వైనాట్ 175', 'అన్నా మీరు జాగ్రత్త – మీ ఆరోగ్యం జాగ్రత్త', 'ఎన్ని యుగాలైనా చరిత్రలో నిలిచిపోతావన్నా' అనే ప్లకార్డులతో స్వాగతం పలికారు. దీనికి పులకించిపోయిన ఆయన విద్యార్థులకు నవ్వుతూ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. సీఎం అభివాదంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు.
- పెద్దాపురం బైపాస్ పాండవుల మెట్ట క్రాస్ నుంచి సామర్లకోట జంక్షన్‌కు చేరుకునేసరికి బస్సుకు ఎదురెళ్లి అక్కడి పార్టీ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు, ఆయన భార్య చంద్రకళ, కుమార్తె సారిక హారతిచ్చి జగన్‌కు స్వాగతం పలికారు. దొరబాబు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జన సందోహం, పార్టీ శ్రేణులు, మహిళలు వెంట రాగా పలువురు తప్పెటగుళ్లు, తీన్‌మార్ వాయిద్యాలతో జనజాతరను తలపింపజేశారు. డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో ఆ ప్రాంతం హోరెత్తి పోవడంతో తమ అభిమాన నాయకుడు వచ్చాడన్న ఆనందం అక్కడి వారి ముఖాల్లో స్పష్టంగా కనిపించింది.



సీఎం జగన్‌కు దిష్టి తీస్తున్న పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు సతీమణి చంద్రకళ, కుమార్తె సార్విక



'మా దేవుడు జగన్' ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అభిమానులు



అభిమాన నేత చిత్రాన్ని సెల్‌ఫోన్‌లో బంధిస్తూ..

బస్సు ఆపి పెద్దామెతో మాటామంతీ..

అచ్చంపేట ఫ్లై ఓవర్ క్రాస్ వద్ద వీకే రాయపురం గ్రామానికి చెందిన మోర్త కుమారి అనే పెద్దామె దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఫొటో చేత్తో పట్టుకుని బస్సు వెనుక పరుగున వస్తున్న విషయాన్ని సీఎం జగన్ గమనించారు. వెంటనే బస్సును నిలిపి, కిందకు దిగారు. కుమారిని బస్సు వద్దకు పిలిచి మాట్లాడారు. దీంతో ఆమె ఆనందానికి అంతే లేకుండా పోయింది. వైఎస్సార్ గతంలో సామర్లకోట వచ్చినప్పుడు తాను జున్ను తినిపించినప్పుడు తీసిన ఫొటోను ఆమె సీఎం జగన్‌కు చూపించింది. 'నీకు ఏం కావాలమ్మా' అని జగన్ అడగగా.. 'నాకేమీ వద్దయ్యా.. మీరు మరోసారి సీఎం కావాలి' అంటూ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బు అయ్యింది. ఆ సమయంలో అక్కడున్న మహిళలు, యువత ఒక్కసారిగా కేరింతలు కొడుతూ జగన్ నినాదాలతో హోరెత్తించారు.

అభిమానుల సందడి

మధ్యాహ్నం ఒంటి గంటకు ఉండూరు క్రాస్ రోడ్డులో మధ్యాహ్న భోజన విరామ శిబిరానికి సీఎం జగన్ చేరుకున్నారు. జనం మండే సూరీడును సైతం లెక్క చేయలేదు. ముఖ్యమంత్రిలో చెక్కుచెదరని చిరునవ్వుతో తన కోసమే వేచి చూస్తోన్న మహిళలు, అవ్వాతాతలు, చిన్నారులు, పార్టీ నేతలకు చేతులు పైకెత్తి అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. దారి పొడవునా తీన్‌మార్‌లు, డప్పుల సందడితో ఎక్కడ చూసినా అభిమానులు సందడి చేశారు. బస్సు యాత్ర జన ప్రవాహాన్ని తలపించింది. దారి పొడవునా మహిళలు బూడిద గుమ్మడి కాయలపై హారతి వెలిగించి దిష్టి తీసి.. 'నువ్వు చల్లగా ఉండాలయ్యా' అంటూ దీవించారు.

అడుగడుగునా.. అభిమాన తరంగమే..

కాకినాడ అచ్చంపేట జంక్షన్‌లో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభ అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర తిమ్మాపురం, చిత్రాడ, పిఠాపురం పాదగయ సెంటర్‌కు సాయంత్రం చేరింది. అక్కడ మధ్యాహ్నం నుంచీ ఎదురు చూస్తున్న అభిమానులు, పార్టీ శ్రేణులు ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. మేళతాళాలతో యువకులు కదం తొక్కారు. ప్రియ నేతను కన్నులారా చూసిన సంతోషంతో ప్రజలు నృత్యాలతో ఆనందడోలికల్లో తేలియాడారు. వారికి సీఎం జగన్ బస్సు పై నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పిఠాపురం బైపాస్ 216 జాతీయ రహదారిపై విరవాడ సెంటర్, రాయవరం సెంటర్, వై జంక్షన్ వద్ద జనాలు బారులు తీరి రోడ్లకు ఇరువైపులా నిలబడి పూలజల్లులతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రతిగా జగన్ ప్రజలకు అభివాదం చేశారు. గొల్లప్రోలు టోల్ ప్లాజా నుంచి ప్రత్తిపాడు రోడ్డు, గొల్లప్రోలు జంక్షన్, తాటిపర్తి రోడ్ల వద్ద పెద్ద సంఖ్యలో మహిళలు, యువత పార్టీ జెండాలను రెపరెపలాడిస్తూ అభిమాన నేతకు సాదర స్వాగతం పలికారు. చేబ్రోలు బైపాస్‌లో తమ సమస్యలకు పరిష్కారం చూపాలంటూ పట్టు రైతులు ప్లకార్డులు ప్రదర్శించారు. వారిని గమనించని సీఎం జగన్.. కాస్త ముందుకు వెళ్లిన తర్వాత రైతులు తనకోసం వేచి ఉన్నారనే విషయం స్ఫురణకు తెచ్చుకున్నారు. వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులను పంపించి ఆ రైతులకు భరోసా కల్పించారు. ఆదర్శ కాలేజీ సెంటర్‌లో స్థానికులకు అభివాదం చేసి, దుర్గాడ సెంటర్ సత్తెమ్మ తల్లి ఆలయం మీదుగా కత్తిపూడి చేరుకున్నారు. బస్సు యాత్ర ఆలస్యమైనా ఆయన వచ్చే వరకూ దారి పొడవునా ప్రజలు తమ అభిమాన నేత కోసం వేచి చూస్తునే ఉన్నారు. రోడ్డు షోలో దారి పొడవునా అశేష జనవాహినిని ఆత్మీయంగా అభివాదం చేస్తూ కత్తిపూడి మీదుగా అన్నవరం, తలుపులమ్మ దేవస్థానం ముఖద్వారం మీదుగా తుని బైపాస్‌కు చేరుకున్నారు. అక్కడ మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యాన పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన జనం ఒక్కసారిగా బాణసంచా కాలుస్తూ బ్రహ్మరథం పట్టారు. బస్సుపై జగన్‌తో పాటు మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ ప్రజలకు అభివాదం చేశారు. అక్కడి నుంచి మేమంతా సిద్ధం బస్సు యాత్ర తాండవ వంతెన మీదుగా అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలోకి ప్రవేశించింది.

క్లుప్తంగా

భీమేశ్వరాలయ జీర్ణోద్ధరణ పనులు

ఈఓ తారకేశ్వరరావు



విలేకరులతో మాట్లాడుతున్న ఈఓ తారకేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, పంచారామాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వరస్వామివారి ఆలయం జీర్ణోద్ధరణ పనులను కేంద్ర పురావస్తు శాఖ ఆదేశాల మేరకు ఈ నెల 24 నుంచి జూన్ 30 వ తేదీ వరకు చేపట్టనున్నట్లు ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. ఈ నేపథ్యంలో భీమేశ్వరస్వామి, మాణిక్యాంబా అమ్మవార్ల గర్భాలయాలను పురావస్తు శాఖ స్వాధీనం చేసుకుని మరమ్మతులు చేపడుతున్నందున ప్రత్యామ్నాయంగా శృంగేరి పీఠాధిపతులు శ్రీ భారతీ తీర్థ మహాస్వామి అందజేసిన నర్మద బాణ లింగానికి, శ్రీ చక్ర యంత్రానికి ప్రతి నిత్యం ఉదయం 6 గంటలకు ప్రథమాభిషేకాలు, కుంకుమార్చనలు ఉదయం 10 గంటలకు అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించడంతో పాటు స్వామి, అమ్మవార్లకు ప్రతి నిత్యం అర్జిత సేవలు, నిత్య కైంకర్యాలు యథావిధిగా నిర్వహిస్తామన్నారు.

పోక్సో కేసులో జీవిత ఖైదు

గోపాలపురం: పోక్సో కేసులో ఒక వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ ఏలూరు పోక్సో కోర్టు తీర్పు చెప్పినట్లు గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. తూర్పుగోదగోపాలపురం పెద్దగూడెం కాలనీకి చెందిన ముప్పిడి సంపత్‌రావు(75)పై 2017లో పోక్సో కేసు నమోదు చేశారు. ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేశాడన్న నేరం రుజువు కావడంతో ఏలూరు పోక్సో కోర్టు జడ్జి ఎస్.ఉమాసునంద తీర్పు చెప్పినట్లు తెలిపారు. ముద్దాయికి జీవిత కాల శిక్షతో పాటు రూ.వేయి జరిమానా, బాధితురాలికి రూ.2లక్షల 50వేలు చెల్లించాలంటూ ప్రభుత్వానికి సిఫారసు చేస్తూ తీర్పు చెప్పినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రగతి ప్రదాతకు జేజేలు

ఆకాశమే హద్దుగా చిత్తశుద్ధి కొలమానంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగనన్నకు కాకినాడ జిల్లా హారతులు పట్టింది. ప్రగతి ప్రదాత సంక్షేమ విధాత అని జేజేలు పలికింది. మేమంతా సిద్ధం బస్సుయాత్ర జిల్లాలోకి ప్రవేశించినది మొదలు రాత్రి బస చేసే గొడిచర్ల చేరుకునే వరకు జనం బ్రహ్మరథం పట్టారు. గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసి మహిళా సాధికారతకు శ్రీకారం చుట్టిన తమ వాడిని జనం మనసారా ఆహ్వానించారు. నా బీసీ, నా ఎస్సీ, నా మైనారిటీ అంటూ బడుగులను హృదయపూర్వకంగా పొదివి పట్టుకున్న ఔదార్యాన్ని మనసారా స్వాగతించారు. అన్ని వర్గాలను అధికారంలో భాగస్వాములను చేయడమే నిజమైన ప్రజాస్వామ్యమని చాటిన దార్శనికుడిని ప్రతి గుండె అక్కున చేర్చుకుంది. మళ్లీ అధికారంలోకి వచ్చి మా బాగోగులు చూడాలని నిండు హృదయంతో ఆశీర్వదించింది.



చిక్కటి చిరునవ్వులు... జై జగన్ నినాదాలు



అభినేత.. అభివాదం



అభిమానం.. రెపరెపలు..



అదిగదిగో.. మన జగనన్న..



జెండా పట్టి.. చెట్టులెక్కి..



ఆకాంక్షలకు.. అక్షర రూపం



అన్నొచ్చిపోతున్నాడు.. పరిగెట్టు..



ఇరుగు దిష్టి.. పొరుగు దిష్టి

ఎన్నికలకు ప్రత్యేకాధికారుల నియామకం



కలెక్టరేట్‌లో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు ఉమేష్ కుమార్, రాహుల్ ధింగ్రా

సాక్షి అమలాపురం: జిల్లాలో పార్లమెంట్, అసెంబ్లీ సాధారణ ఎన్నికల నిర్వహణ తీరును పర్యవేక్షించేందుకు ఇద్దరు సాధారణ పరిశీలకులు, ముగ్గురు వ్యయ పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించిందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజేశ్వర్ గోయల్ (ఐఏఎస్), ప్రదీప్ కుమార్ (ఐఏఎస్) సాధారణ పరిశీలకులుగా, ఉమేష్ కుమార్ (ఐఆర్ఎస్) పార్లమెంట్ స్థానానికి వ్యయ పరిశీలకులుగా, రాహుల్ ధింగ్రా (ఐఆర్ఎస్), సుమిత్ దాస్ గుప్తా (ఐఆర్ఎస్)లను ఏడు అసెంబ్లీ స్థానాలకు వ్యయ పరిశీలకులుగా ఎన్నికల సంఘం నియమించిందన్నారు.

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు ఉమేష్‌కుమార్ తెలిపారు. అకౌంటింగ్, వీడియో సర్వేలెన్స్, ఫ్లయింగ్ బృందాలతో కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. పార్లమెంట్, అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఖర్చుల గణనపై అవగాహన కల్పించారు. ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత చేపట్టిన గణాంకాలపై ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలలో ఖమ్మం జిల్లాలో వ్యయ పరిశీలకుడిగా పనిచేశానని సాధారణ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు బృందాలు కృషి చేయాలన్నారు. అనుమతులు సక్రమంగా లేని పక్షంలో వాహనాలు ఆర్వో ద్వారా సీజ్ చేయించాలని సూచించారు. నగదు అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు సంబంధిత బృందాలు తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. రూ10 లక్షలు దాటి నగదు రవాణా అవుతున్నట్లయితే నగదు సీజ్ చేసి ఆదాయ పన్ను శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. మద్యం విక్రయాలు లిక్కర్ షాపుల ద్వారా ఎన్నికల సమయంలో పెరిగినట్టు గుర్తిస్తే నిఘా మరింత పెంచాలన్నారు. అభ్యర్థుల ఊరేగింపులు ర్యాలీలు, బహిరంగ సభల వీడియోలను సక్రమంగా చిత్రీకరించి అకౌంటింగ్ టీమ్‌కు

అధికారి పేరు	కేటాయించిన స్థానం	సెల్ నెం.
రాజేశ్వర్ గోయల్	జనరల్ అబ్జర్వర్	89789 62588
ప్రదీప్ కుమార్	జనరల్ అబ్జర్వర్	89775 02588
ఉమేష్ కుమార్	వ్యయ పరిశీలకులు	78935 12588
రాహుల్ ధింగ్రా	వ్యయ పరిశీలకులు	89784 52588
సుమిత్ దాస్ గుప్తా	వ్యయ పరిశీలకులు	73308 62588

అందించాలని, అకౌంటింగ్ టీం నిర్దేశిత రేట్ల ప్రకారం అభ్యర్థులకు సంబంధించిన వ్యయాలను గణించాలని సూచించారు. నామినేషన్లు వేసిన తేదీ నుంచి మరింత అప్రమత్తంగా గణాంకాలు చేపట్టాలన్నారు. బ్యాంకులలో నగదు లావాదేవీలు రోజువారీ నివేదికను జిల్లా ఎన్నికల అధికారి ఎల్‌డీఎంకు సమర్పించాలని సూచించారు. మరో వ్యయ పరిశీలకులు రాహుల్ ధింగ్రా మాట్లాడుతూ ఎన్నికల్లో మద్యం, నగదు, ఉచిత వస్తువులు పంపిణీ జరగకుండా పర్యవేక్షించాలన్నారు. సాధారణ ఎన్నికలు అత్యంత ఖర్చుతో కూడుకున్నాయని, అభ్యర్థుల ఖర్చుపై ఎన్నికల సంఘం పరిమితి విధించినందున ఆ ప్రకారం మాత్రమే ఖర్చు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి రామనాథం, నోడల్ అధికారి మురళీకృష్ణ, జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాప్‌రావు పాల్గొన్నారు.

నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు 13 నామినేషన్లు

రెండోరోజు పార్లమెంట్ నియోజకవర్గానికి నిల్

అమలాపురం రూరల్: అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి రెండోరోజు నామినేషను బోణీ కాలేదు. నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు 13 నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ తరుపున పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మూడు సెట్లు, పొన్నాడ నీరజ ఒక సెట్ నామినేషన్ వేశారు. కాంగ్రెస్ నుంచి పాలెపు ధర్మారావు ఒక సెట్ సత్తిరాజు ఎస్‌వీయువీఆర్ఎస్ స్వామి బిరా రాజ్‌కుమార్ ఇండిపెండెంట్లుగా ఒక సెట్ చప్పున ఒక సెట్ నామినేషన్ వేశారు. రామచంద్రపురం నియోజకవర్గం నుంచి బహుజన సమాజ్ పార్టీ తరఫున మతా సుబ్రహ్మణ్యం ఒక సెట్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి జుట్టుక వెంకటరావు ఒక సెట్ నామినేషన్ వేశారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా అయితాబత్తుల ఆనందరావు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మండపేట నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా మందపల్లి రవి, నవతరం పార్టీ నుంచి నందికోళ్ల రాజు ఒక సెట్ నామినేషన్లు దాఖలు చేశారు.

పవన్‌ది రాజకీయంలోనూ నటనే

ఏపీ అగ్రి మిషన్ సభ్యుడు బాబి

అమలాపురం టౌన్: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఇంతకాలం సినిమాల్లో మాత్రమే నటిస్తారనుకున్నాం. ఆయన రాజకీయాల్లోనూ నటిస్తారని ఆయన స్థిరత్వంలేని మాటలే తేటతెల్లం చేస్తున్నాయని ఏపీ అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబి) అన్నారు. అమలాపురంలో బాబి స్థానిక మీడియాతో శుక్రవారం మాట్లాడారు. గతంలో టీడీపీ, బీజేపీని, ప్రధానమంత్రి మోదీ, చంద్రబాబు, లోకేష్‌లపై ఎన్నో ఆరోపణలు చేసిన పవన్ కళ్యాణ్ ఆ నోటితోనే నేడు ఇంద్రుడు, చంద్రుడు అంటూ వారిని పొగడ్తలతో ముంచెత్తుతున్న తీరు సినిమాల్లోని ఆయన నటనను ప్రజలకు గుర్తుకు చేస్తోందని బాబి అన్నారు. వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్, ఎంపీ పి.మిధున్‌రెడ్డిని గోదావరి జిల్లాలో ఆయన పెత్తనం ఏమిటి? అని ప్రశ్నిస్తున్న పవన్‌కళ్యాణ్ నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో చదువుకున్నానని చెప్పే ఆయనకు పిఠాపురంతో పనేంటని బాబి ఎదురు ప్రశ్న వేశారు. గోదావరి జిల్లాల పార్టీ కో ఆర్డినేటర్‌గా వైఎస్సార్ సీపీని పర్యవేక్షిస్తున్న మిధున్‌రెడ్డిని పవన్ కళ్యాణ్‌కి విమర్శించే అర్హత లేదని చెప్పారు. పావలా పవన్ అంటూ తిట్టిన టీడీపీతోనే అంటకాగుతున్న నీ రాజకీయ పరిణితిపై ప్రజలు చర్చించుకుంటున్నారని బాబి పేర్కొన్నారు.

మత్స్యకారులకు ఓఎన్‌జీసీ పరిహారంపై సీఎం జగన్ భరోసా

- మేమంతా సిద్ధం సభలో మీ బిడ్డ జగన్ వల్లనే ఓఎన్‌జీసీ కమిటీ ఏర్పాటని వెల్లడి
- ముమ్మిడివరంలో మాదిరిగా అందరికీ మంచి జరుగుతుందని హామీ

కాకినాడ రూరల్: మత్స్యకారులందరికీ ఓఎన్‌జీసీ పరిహారంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. అచ్చంపేట జంక్షన్ వద్ద మేమంతా సిద్ధం బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడుతూ మత్స్యకారులకు పరిహారం కోసం ఓఎన్‌జీసీ కమిటీ ఏర్పాటు చేసిందంటే దానికి కారణం మీ బిడ్డ జగన్, వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే కారణం అన్నారు. ప్రతీ ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలని, ఈ రోజు కమిటీ ఏర్పాటయ్యిందని, ఆ కమిటీ రికమండేషన్ ఆధారంగా ప్రతీ మత్స్యకార కుటుంబానికి మంచి జరిగేటట్టుగా మీ బిడ్డ అండగా ఉంటాడని హామీ ఇస్తున్నానన్నారు. ఎప్పటి నుంచో పరిష్కారం కాని సమస్యను పరిష్కరించి ముమ్మిడివరంలో మత్స్యకారులకు పరిహారం ఇచ్చామని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

అంతకుముందు బహిరంగ సభలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ ఈ తీరప్రాంతంలో ఓఎన్జీసీ ఒక సిస్మిక్ సర్వేతో 500 కిలోమీటర్ల మేర ఎక్కడా మత్స్యకారులు వేట చేయకూడదని, 35 కిలోమీటర్లు నో మ్యాన్ జోన్ అని ప్రకటించినప్పుడు మత్స్యకారుల ఉద్యమానికి అండగా నిలిచామన్నారు. తాను, సిటీ శాసనసభ్యుడు చంద్రశేఖరరెడ్డి, ఎంపీ వంగా గీత మత్స్యకారుల ఉద్యమానికి సంఘీభావం ప్రకటించి మాట్లాడడంతోపాటు సీఎం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దీంతో కమిటీ ఏర్పాటుకు ఓఎన్‌జీసీ ముందుకు వచ్చిందన్నారు. సరిగ్గా 5 సంవత్సరాల క్రితం 2019 ఎన్నికలకు ముందు కాకినాడ రూరల్ నియోజకవర్గంలో విజయశంఖారావాన్ని తొలిసభలో పూరించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ఇప్పుడు నామినేషన్ల పర్వం ప్రారంభమైన వెంటనే కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సభకు రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మనందరి తరపున థ్యాంక్యూ సీఎం సార్ అని చెబుతున్నానన్నారు. జగనన్నకు, ఈ కుటిల నీతితో రాజకీయాలు చేస్తున్న చంద్రబాబుకు ఉన్న తేడా ఏమిటంటే మీతో పోలికే లేని నాయకుడు చంద్రబాబు తన మందీమార్బలాన్ని, మీడియా బలాన్ని వెనకేసుకుని ప్రతిరోజూ బురద జల్లే కార్యక్రమం చేస్తున్నారన్నారు. మీరు నాణ్యమైన వైద్యాన్ని అందిస్తానంటుంటే చంద్రబాబు నాణ్యమైన మద్యాన్ని అందిస్తానంటున్నాడని ఇది చాలు మీకు, ఆయనకు ఉన్న పోలిక ఏమిటో అర్థమవుందని సీఎంను ఉద్దేశించి అన్నారు. చంద్రబాబుకు బిల్డప్ ఎక్కువ, పని తక్కువ. సింపుల్ గా చెప్పాలంటే.. సంక్రాంతికి పప్పుబెల్లాలను చంద్రబాబు పంచి పెడితే, మీరు ఇచ్చే కానుకలు జీవితాలను నిలబెట్టేవి, భవిష్యత్ తరాలకు తల రాత రాసేవన్నారు. ఇంగ్లిష్ మీడియం మొదలుకుని వైద్యం, విద్య, ఆరోగ్యాల్లో ఒక విప్లవాన్ని మీరు సృష్టించారని, ఇంటి స్థలం, వైద్యం, ఆరోగ్యశ్రీ ఆదేవిధంగా ఎన్నో కానుకలు మీరు అందించి చేయూత, భరోసాలాంటివి కూడా అందించి భవిష్యత్ తరాలను తీర్చిదిద్దుతున్నారని సీఎంకు కన్నబాబు కృతజ్ఞతలు తెలిపారు.